# బహుమతి కథ

"కథా రచయితలకో సువర్ణావకాశం....!"

వార పత్రిక పతాక శీర్షిక రాజారాం కళ్ళల్లో కమ్మని కాంతులు చిలికింది. నరాల్లో కొత్త ఉత్సాహం పరుగులు తీసింది. ఊహా తరంగాలకు ఊపొచ్చింది.

ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్న అవకాశం ఎదురొచ్చి నిల్చున్న అనుభూతి.

ఆ శీర్షిక అతన్నంతగా అలరించడానికో ఫ్లాష్‌బాకుంది.

చెడ్డీలు కట్టినప్పట్నుంచి చైతన్య కళాశాల నుండి డిగ్రీ పుచ్చుకునే వరకు కథా సరిత్సాగరంలో మునిగి తేలేవాడు. బాలమిత్ర నుండి భారతి వరకు పత్రికల్లోని కథలెన్నో చదివేసేవాడు–సరదాగా.

వంద పుస్తకాలు చదివినవాడు వంద ఒకటవ పుస్తక రచయితై కూచుంటాడనే సంగతి ఆలస్యంగా తెలిసినా అమితమైన స్ఫూర్తినిచ్చింది. అది తెలిసినప్పట్నుంచీ తానూ ఓ రచయితనై పోవాలనే కోరిక పెనవేసుకుని రోజు రోజుకూ బిగుసుకు పోతుంది.

"అష్ట కష్టాలనుభవించి కథ రాసి పంపగానే సరిపోదు, అది అచ్చవాలంటే బోలెడు తతంగముంటుంది - పత్రికాఫీసులో."

"చిత్తు కాయితాల దుకాణాలకూ, తపాలా శాఖకూ రచయితలే రాజ పోషకులటా...."

"పంపిన కథ పదిరోజుల్లో తిరిగొచ్చి వొళ్లో వాలడం గ్యారంటీ...."

"కాయితాల ఖర్చూ, పోస్టేజీ, తిరుగు టపాలో వచ్చిన కథను క్షేమంగా అందించిన పోస్టుమెన్ టిప్పూ....అన్నీ కలిస్తే తడిసి మోపెడవుతుంది ఖర్చు"

"దానికి తగలేసే ఖర్చుతో హాపీగా ఓ ఫైటింగ్ సినిమా చూడొచ్చు, మనోరంజనం-మహా పొదుపు."

మిత్రుల వ్యాఖ్యానాలకు గుండె బేజారైనమాట వాస్తవమే. అధైర్యం వెన్ను తట్టాలని ప్రయత్నించిన సంగతీ వాస్తవమే. కాని.... రాజారావంటే రంగూ, రుచీ, వాసనలు స్వయంగా నిర్ణయించుకోలేని మనిషికాడు. ఇతరుల సలహాలను గుడ్డిగా పాటించే కుహనా మేధావీ కాడు. "అందరు చెప్పేది విని- నువు చేసేది చెయ్" మన్న సామెతను అక్షరాలా అమలు పరిచే ఆత్మ స్థయిర్యం బోలెడుందతనికి.

పట్టు వదలని విక్రమార్కుడు ప్రత్యక్షమై ఏ విభూతి మంత్రించి ఇచ్చాడో కాని బ్రహ్మాండమైన ప్లాటు బుర్రలో పురివిప్పి నాట్యం చేసిందో బ్రహ్మముహూర్తాన. అదే ప్లాటు మెదడు పొరల్లో కథారూపమై కదలాడింది. దిగ్గున మంచం మీంచి లేచి టేబుల్ ముందు వాలాడా క్షణం. కలం ఊట కాయితమనే సుక్షేత్రమ్మీద గలగలా పారింది. తూరుపు కొండలు ఎర్రబారి కిటికీలోంచి దూరి వచ్చిన సూర్య కిరణాలు చెంపల్ని నిమిరే సరికి కథ చిత్తుకాపీ తయారైంది.

నాణ్యమైన రచయితలకు నాలుగు సూత్రాలు-చదవడం, వ్రాయడం పత్రిక్కి పంపించడం, మరిచిపోవడం-గుర్తొచ్చి కథ ఫెయిరయింది. పున రాలోచనకు తావివ్వకుండా పోస్టులో పడిపోయింది మొదటి కథ.

మొదటి మూడు సూత్రాలు అక్షరాలా అమలు జరిగినా నాల్గోసూత్రం నంగనాచిలా ఎదురు తిరిగింది.

రోజుకో-కల....

తన కథ పత్రికలో అచ్చయినట్టూ....

కథను చదివిన పాఠకులెందరో ప్రశంసల వర్షం కురిపించినట్టూ...

పత్రికా సంపాదకుడు తనను ప్రత్యేకంగా పిలిపించుకున్నట్టూ .... మరిన్ని కథలు రాసి పంపమని గెడ్డం పట్టుకు బతిమాలినట్టూ.

తన ఛాతీ ఆరంగుళాలు పెరిగినట్టూ...

ఇంకేదేదో...

కలలు అక్షరాలా నిజం కాకపోయినా అన్నీ అబద్ధం కాలేదు. నెల రోజుల్లో కథ అచ్చయింది. అందిన పారితోషికం స్వీటు పార్టీకి సరిపోకపోతే జేబునుండి మరింత కలుపాల్సొచ్చింది.

మరో కథ రాయాలని మనసు ఉబలాట పడింది. అలా విచ్చుకున్న రాజారాం కథా విపంచి ఎన్నో రాగాలు పలికింది. ఎన్నో దిన, వార, మాస పత్రికల్లో అతని కథలు చోటు చేసుకున్నాయి.

రచనా వ్యాసంగం మూడు పూవులారు కాయలైందనటానికి నిదర్శనం కథల పోటీలో బహుమతి పొందడమే ననే అభిప్రాయం బలపడింది. అదలా బలపడిం తర్వాత ఏ పత్రికా కథల పోటీ నిర్వహించేందుకు ముందుకురాలేదు.

ఈ రోజు మిత్ర బృందముతో గుడిశె హోటల్లో చాయ్ సేవిస్తుంటే- అపురూపమైన ప్రకటన కనబడింది.

హోటల్నిండా అలుముకుని సన్నాయి రాగాలు వినిపిస్తున్న దోమల ఉనికిని గుర్తించాలనిపించలేదు. ముక్కుమీదా చెంపల మీదా వాలి రక్త దాహం తీర్చుకుంటున్న ప్రాణుల్ని తోలాలనే ధ్యాస కూడా రాలేదు. వార పత్రిక చేతిలో నలిగిపోతుంది. కళ్ళు అక్షరాల నేరుకుంటున్నాయి-ఆసక్తిగా.

"కథల పోటీకి నిబంధనలు...

ఇతివృత్తమేదైనా కావచ్చు. ఒక రచయిత (త్రి), ఎన్ని కథలైనా పంపవచ్చు. వచ్చే నెల మొదటి తేదీ వరకు కథలు చేరాలి, ప్రథమ బహుమతి కథకు పదివేలు. ద్వితీయ బహుమతి కథకు ఎనిమిది వేలు. తృతీయ బహుమతి కథకు ఐదు వేలు, రెండు ఉత్తమ కథలకు చెరో వెయ్యి రూపాయల నగదు బహుమతులు. సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథకు ఒక్కొక్కదానికి రెండొందల రూపాయల పారితోషికం... "

సగం తాగిన చాయ్ గ్లాసు అలాగే చల్లారిపోయింది టేబుల్ మీద. చూపులు శూన్యంలోకి చొచ్చుకు పోతున్నాయి-కథకు ప్లాటు వెతకడంకోసం. మెదడు నరాల్లో భావ తరంగాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

" వీడింతవరదాకా బాగానే వున్నాడు గదరా! " మురారి ఆందోళన అందరి దృష్టి నాకర్షించింది.

"ఏదో ఉద్యోగ ప్రకటన చదివినంత ఇదిగా చదువుతున్నాడురా పనికి మాలిన పత్రికటననూ...." ప్రకటన చదివి మిత్రులందరికీ విన్పించాడు రాఘవ.

" వీడిదో పిచ్చిమాలోకం. కథలూ కాకరకాయలని విలువైన సమయాన్ని వృథా చేస్తుంటాడు, ఆఫీసులో ఉన్నంత సేపు ఫైల్లో దూర్చిన తల పైకెత్తడు. మనిషిక్కడ మనసెక్కడో! ఇంటికి రాగానే కాగితాలు ఖరాబు కార్యక్రమంలో లీనమౌతాడు. వీడి నెలాగైనా ఈ వ్యసనం లోంచి తప్పించాల్రా!" కోవర్కరూ, కాలేజీలో సీనియరూ అయిన జగన్ రాజారాం గదవబట్టి పక్కకు తిప్పాడు.

"అబ్బా... నువ్వుండు గురూ!" చీదరింపులో పట్టు సడలని పట్టుదల ధ్వనించింది.

కొన్ని పదుల కథలు రాయగా, రాసిన కథలన్నీ పత్రికా కార్యాలయాల్లో నిద్రలు దీసి తిరిగొచ్చినా ధైర్యం వీడక రాత ప్రతుల్ని చిత్తుకాయితాల దుకాణంలో అమ్మేసిన హన్మంతు - ఖాళీ చేసిన చాయ్ గ్లాసుతో రాజారాం భుజం తడుతూ

" నాయనా కథల పోటీకి కథ పంపాలనుకుంటున్నావా!?" అన్నాడు. వేదాంతసారం బోధించే ముందు ఉపోద్ఘాతంలా.

"... ... ... ..."

రెండు నిమిషాలు నోర్లు మూసుకున్నాయి.

"తప్పు నాయనా తప్పు!"

"ఎందుకూ...ఎందుకూంట! ఆరోజు కథ రాసేందుకో ప్లాటు చెప్పరా పాపాల భైరవాంటే ఇలాగే కూశావు-శకున పక్షిలా. నీమాటలన్నీ బేకార్!" ఎగబడినంత పంజేసి కౌంటర్లో బిల్ కట్టేశాడు రాజారాం.

"సాధారణంగా నువ్వు కథ పంపడమూ, వారు వేసుకోవడమూ వేరు. పోటీలో నిలదొక్కుకుని బహుమతి సంపాదించడం వేరు " హోటల్ మెట్లు దిగుతూ రాజారామ్మీదో చెయ్యి, జగన్మీదో చెయ్యివేసి మధ్యలో నడుస్తున్నాడు హన్మంతు " పత్రికాఫీసులో ఉన్నన్ని రాజకీయాలు మరెక్కడా ఉండవనుకో వెర్రి నాగన్నా! కథలన్నింటినీ చదివి, పరిశీలించి మంచి కథకు బహుమతులిచ్చే కాలం చెల్లిపోయింది, ఇరవయ్యొకటో శతాబ్దంలో అడుగు పెట్టబోతూ కూడా ఈ నగ్న సత్యం తెలుసుకోలేక పోయావంటే....

నీ మీద జాలేస్తుందోయి. నీ అమాయకత్వానికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కావడం లేదురా!"

" కూసే గాడిదొచ్చి మేసే గాడిదను చెడగొట్టిందట .... " రాజారాం పట్టుదల పెరిగిందేకాని తరగలేదు.

" ఒరేయ్! గల్ఫ్‌లో యుద్ధం, దేశ రాజకీయాలు, మత కల్లోలాలు లాంటి విషయాలన్నీ వొదిలేసి డైరీ సబ్జెక్టు పట్టుకుని మా ప్రాణాలు తోడేస్తా రెందుకురా! మీరా సబ్జెక్ట్ డ్రాప్ చెయ్యకపోతే..." ఏదో సాహస ప్రతిజ్ఞకు పూనుకోబోతున్న జగన్ నోరు మూశాడు - రవీందర్.

ట్రాఫిక్ మార్చి మాట్లాడ్తూ చౌరస్తా చేరుకున్నారు. విడిపోయే ముందు

"ఒరేయ్ రాజారామా! నేంజెప్పాల్సిందంతా చెప్పేశాను. ఆ తర్వాత నీ ఇష్టం" ఫైనల్ వార్నింగొచ్చింది హన్మంతు నుంచి.

* * * *

ఆఫీసుకొస్తున్న వార పత్రికలో గూడా కనబడిందా ప్రకటన - రాజారాంకు.

కథలు చేరాల్సిన చివరి తేది ... అంటే ఇంకో పదిహేను రోజుల టైముంది... వెచ్చని సిట్టూర్పు తోసుకొచ్చింది.

కథకో ప్లాటు కావాలి. ప్లాటు కొరకు పాట్లు పడాలి. టేబుల్ మీది ఫైళ్లు పక్కకు జరిగిసై. చూపులు ఆఫీసు గోడల మీద కొత్తగా వాల్తున్నాయి. ఎదన్నా మంచి ప్లాటు దొరకాలని-మబ్బుల మధ్య మెరుపుల్లా మస్తిష్కం తెర పొరల్లో ఊహలేవో ఊపిరి పోసుకునే లోపల్నే మాయమైపోతున్నాయి. కొన్ని టన్నుల బరువెక్కింది తల. కాంటీన్‌లో వేడి వేడి కాఫీ దొరికింది. కాస్త రిలీఫన్పించింది. చూపులు మళ్ళీ గోడల కతికించి - బలవంతంగా ఊహల పల్లకి నెక్కేశాడు.

ఏవేవో ప్లాట్స్ వానాకాలం నీటి బుడగల్లా మెరిసి మాయమౌతు న్నాయి. ఒక్కటీ కొలిక్కి రావడంలేదు. చేతినిండా పనున్న సమయాల్లో అనాలోచితంగా వస్తాయి ప్లాట్స్. పనంతా పక్కకు నెట్టి కాయితం కలం పుచ్చుకోవాల్సొస్తుందప్పుడు. కాని ఈ రోజెందుకో పని బాగున్నా ప్లాటు తోచడంలేదు. కావాలని పట్టు పట్టినా లాభం లేదు. మెదడు నరాలు మెలి పెడుతున్నాయి. ఒళ్ళంతా కుదిపేసినట్టు...వికారంగా ఉంది.

ఆఫీసు గడియారం ఐదుసార్లు గొంతు చించుకుంది - చేసిన పనులు చాలు ఇక ఆఫీసు కట్టెయ్యండని. కొండను తవ్వినా ఎలుకను గూడా దీయ లేక పోయాననే నిస్పృహ వెక్కిరిస్తుంది.

ఇంటికొస్తూ మార్గ మధ్యంలో మరో ప్రయత్నం జరిగింది. నడుస్తుం డగానే దేవులాట...

మిత్రుడొకరు పలుకరిస్తే గుర్తొచ్చింది - ఇల్లు దాటి వెల్తున్నట్టు, గిల్టీనెస్. ఆవహించి మొగ్గలా ముడుచుకు పోయి వెనక్కు తిరగాల్సొచ్చింది.

ఇంటికి చేరగానే...

మూన్నెళ్ళ క్రితం తన చేత మూడు ముళ్ళు వేయించుకొని, తన వెంట ఏడడుగులు నడిచిన కమల ముసి ముసి నవ్వులు రంగరించిన కాఫీతో ఎదురైంది. ఆవిడ కను రెప్పల్లో ఆశ, మెరుపు తళుక్కు మంటున్నాయి. కాఫీ కప్పులోంచి ఇల్లాలి అనురాగాన్ని సేవిస్తూ వెతికాడు-ప్లాటు కోసం. రాత్రి భోంచేసినప్పుడు అన్నం కెలుకుతూ ప్రయత్నించాడు.

పడుకుంటే నిద్ర పట్టలేదు. పదకొండు గంటలకు తల మరింత బరు వెక్కింది.

నొప్పి...తల నొప్పి...నరాల్ని పిండేస్తుంది.

కమల నాజూకు చేతులు అమృతాంజనం రుద్దుతూంటే పరిస్థితి మారి పోయింది. కదిల్తే చలి, మెదిల్తే చలి. ఎముకల్లోంచి పుట్టుకొస్తుంది. జవ జవ లాడుతూ కమలను చుట్టేశాయతని చేతులు.

కడుపులోంచి, నరాల్లోంచి, శరీరంలోని ప్రతి అణువులోంచి పుట్టుకొ స్తుంది చలి. భర్త ఒడిలోంచి బలవంతంగా విడిపోయి రెండు దుప్పట్లు తెచ్చి కప్పింది.

"ఇదేమిటండీ! ఉదయం బాగానే ఉన్నారుగ దా!" కమల గొంతులో కంగారు తొంగి చూచింది,

"ఏం లేదు కమలా, నువ్వేం భయపడకూ...అబ్బో చలి!" ఇంత చలి ఒకేసారి ఎలా తోసుకొస్తుందో అంతు చిక్కలేదు.

ఐదు నిమిషాలు గజ గజ లాడించి చప్పున మాయమైంది. వెంటనే ఒళ్ళంతా పొగసెగలై మండిపోతుంది. ఏవో పలవరింతలు...ఏదో ఆరాటం... రాత్రి శివరాత్రై పోయింది.

ఉదయం పక్కింటబ్బాయితో సెలవు కాయిత మెళ్ళింది – ఆఫీసుకు. ఉద్యోగంలో జాయినై సంవత్సరం గూడా నిండలేదు. చాలా సెలవులు పెళ్లికే ఖర్చయిపోయినై. ఇప్పుడున్న మూడ్రోజుల కాజువల్లీవు ఇలా హరాయించుకు పోతున్నందుకు ఉసూరుమంది ప్రాణం.

ఉదయం తలనొప్పిగా వుంటుంది. మధ్యాహ్నం చలి గడ గడ లాడిస్తుంది. ఆ తర్వాత జ్వరమొస్తుంది. సాయంత్రం చెమట పట్టేస్తుంది. రాత్రింతా కాళ్ళూ చేతులు విరామం లేకుండా లాగేస్తుంటాయి. నరాల్లో ప్రవహించేది రక్తమేనా అనే అనుమానం రాకపోలేదు.

డాక్టరు రాసిచ్చిన ఇంజక్షన్లూ, గొట్టం గోలీలు...వాటి దారి వాటిదే. జ్వరం దారి జ్వరందే.

మూడ్రోజుల్లో రెండొందల రూపాయలు తినేసిన జ్వరం బలం పుంజుకుందే తప్ప పట్టు సడలలేదు.

నల్లుల మందు జీర్ణించుకుని నల్లులూ, డి.డి.టి. మింగేసిన దోమలూ బలుస్తున్నాయంటే_అదో జోకనుకుని నవ్వేసిన రాజారాంకు ఇప్పుడది నిజమేననిపించింది.

నాల్గోరోజు లాసాఫ్ పే_సిక్ లీవు దరఖాస్తు పంపక తప్పలేదు.

ఆరోజు సాయంత్రం...

చెమట పట్టాక కలం, కాయితం పట్టుకోవాలనిపించింది.

...ఇంతవరకూ పంపిన కథలన్నీ పత్రికల్లో అచ్చయినవి. ఈసారి పోటీకి కథ పంపించి తీరాలి. పోటీలో బహుమతి రాకపోయినా సాధారణ ప్రచురణకు స్వీకరించక తప్పదు. ఐనా...తన కథకు బహుమతి వచ్చి తీరుతుంది. ఎందుకైనా మంచిది_కథా కథనం, పాత్ర చిత్రణ పకడ్బందీగా నడిపించాలి...

ఊహల వ్యూహం ఓ రూపు దిద్దుకోకముందే నరాలు జువ్వు మంటున్నాయి. కాయితం – కలం అలిగి పక్కకు తప్పుకున్నాయి. "అమ్మా...!" అంటూ ఒరిగిపోయాడు మంచమ్మీద.

"మళ్లీ ఏమైందండీ...?" పరుగెత్తుకొచ్చింది కమల. నీరసంగాపడున్న భర్తనూ, కాయితం కలాన్ని చూడగానే ఒంటి నిండా గాయాలు చేసి కారం చల్లినట్లయింది. కళ్ళల్లో ఎర్ర జీర కదలాడింది.

"మళ్ళీ కాయితం, కలం పుచ్చుకున్నారా? ఇప్పుడా ముదనష్టపు కథ రాయకపోతే కొంపలేమన్నా మునిగిపోతున్నాయా? మీరు మానసికంగా గూడా రెస్టు తీసుకోవాలన్నాడు గదా డాక్టర్! కథ గురించి తంటాలు పడు తుంటే మన కాపురమే ఒక కథై కూచుంటుంది." ధుమ ధుమ లాడుతూ కాయితం చించేసింది. కలం గూట్లోకి విసిరేసింది.

భర్త తలకూ, కాళ్ళు చేతులకూ అమృతాంజనం రుద్దింది, నాజూకు చేతులు ఒంటిమీద నాట్యం చేస్తుంటే కాస్త తేలికనిపించి లేచి కూచోవాలని పించింది.

"నేను కథ రాయాలి కమలా! ప్లీజ్ నన్నాపకు. పోటీకి పంపాలి. ఇంకా కొద్ది రోజులే టైముంది" అనాలకున్నాడు కాని కమల వాలకం పచ్చి వెలక్కాయ గొంతులో పడేసింది.

ఒక వారం గడిచింది,

రోజూ ఉదయం ఇంజక్షన్ తీసుకోవడం, ముప్పూటలా గొట్టం గోలీలు మింగడం రాజారాం కలవాటైతే - రోజూ మధ్యాహ్నం మంచు గడ్డల్లో ముంచెత్తి, నిప్పుల్లో దొర్లించడం, చెమట స్నానం చేయించడం జ్వరాని కలవాటైంది.

నోరంతా చేదుగా... వేపకాయలు నమిలినంత చేదుగా తయారైంది.

చలి వచ్చినప్పుడు నీటినుండి ఒడ్డు కేసిన చేప పిల్లలా కొట్టుకుంటాడు. జ్వరం మండిపోతుంటే...

"కథ పంపించావా కమలా!"

"నా కథకు బహుమతి వచ్చిందా! ఫస్ట్ ప్రైజా? అహ్హా... అహ్హా ..హ్హా..."

"ఏమిటీ....నా కథ ఇంకా పోలేదా?"

"అయ్యయ్యో... నా కథ, నా బహుమతి...."

"ఛిఛీ...ఏం చేస్తున్నావ్ కమలా! నేను మరిచిపోతే నువ్వన్నా గుర్తు చెయ్యొద్దా! మరీ అన్యాయమై పోతున్నావు. రాయ్, రాయ్...నేం జెబుతుం టాను, నువ్వు రాయ్. రాసి ఫెయిర్ చేసి పంపూ..."

సంధి ప్రేలాపన కమల ధైర్యాన్ని కకావికలు చేస్తుంది.

చెమట పట్టి వేడి జారుకున్న తర్వాత

"నేనేమన్నా అతిగా వాగానా కమలా?"

"నిన్నేమన్నా అన్నానా?" అంటూ బాధపడిపోతాడు.

రాత్రంతా నరాలన్నీ ఏతం బోస్తుంటే అర్ధాంగి ఒడిలో తలానించి ఆవిడ ప్రాణాలు తోడేస్తుంటాడు.

కమల ఓపిక హరాయించుకుపోయింది.

అద్దె గది గోడలు కరిగి పోతున్నట్టూ, ఆకాశం విరిగి మీద పడుతున్నట్టూ అనిపిస్తుందావిడకు.

ఇంకా ఆలస్యం చెయ్యకుండా టెలిగ్రామిచ్చి అన్నయ్య కమలాకర్‌ను రప్పించింది.

బావ భాగోతం చెల్లెలి ద్వారా విని

"ఇది మామూలు డాక్టర్లతో కుదిరే రోగం కాదు. స్పెషలిస్టుకు చూపాల్సిందే" నని తేల్చేశాడు కమలాకర్-రోగాల గురించి తన పూర్వానుభవాల్ని ఏకరువు పెట్టి.

కమల గుండెల్లో దాగున్న భయం, ఆందోళన, నిస్సహాయతలు మొహమ్మీదికొచ్చి ఆ తర్వాత కళ్ళల్లో జారబడ్డాయి.

" డబ్బులేవన్నయ్యా... ఉన్న కాస్తా డబ్బు మందులకూ, డాక్టర్ ఫీజుకే సరిపోయింది " చేతుల్లో మొహం దాచుకుంది. వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు అట్టే తెలిసిపోయింది. కమలాకర్ ప్రాణం విలవిల్లాడింది,

చేతి గుడ్డతో కన్నీళ్ళు తుడిచి

" ఛా....డబ్బుకొరకంత బాధపడాలా? వెధవది, నా దగ్గరుందమ్మా!" జేబులో నున్న వంద రూపాయల నోట్లు చూపించాడు.

పెద్ద నర్సింగ్ హోంలో ఐదు గ్లూకోజ్ బాటిల్స్ ఖాళీ అయింతర్వాత రాజారాం నరాల్లోని సత్తువ ఆవలించి నిద్ర మేల్కొంది.

ఇంజక్షన్లు జీర్ణించుకుని కాళ్ళూ, చేతులు తమ ఉనికి తెలుపుకున్నాయి. గొట్టం గోలీలతో కుస్తీ పట్టి అలసిపోయిన జ్వరం తోక ముడిచింది.

నాల్రోజుల్లో రెండు వేల రూపాయల ఖర్చు తేలింది. చలి, జ్వరం కంట్రోలు కాగానే లేచి తిరగ్గలిగాడు-కథా రచయిత,

"చూడు మిష్టర్! శారీరకంగానే కాదు, మానసికంగానూ రెస్టు తీసుకోవాలి సుమా!" అన్నాడు డాక్టర్.

ఇంటికి రాగానే గుండెల నిండా ఊపిరి పీల్చుకుంది కమల. మనసు కుదుట పడింది. కమలాకర్ వెళ్ళిపోతూ మిగిలిన మూడొందలు చెల్లెలు చేతిలో పోస్తూ

" మీ ఆయన్ను కాస్త కంట్రోల్‌లో ఉంచమ్మా " అంటూ హిత బోధ చేశాడు.

ఆరోజు రాత్రి కమలను కౌగిట్లో చేర్చుకున్న నిద్రాదేవి రాజారాంను తన ఛాయల్లోకి రానివ్వలేదు.

రాజారాం పని రాజారాంది.

రాత్రి పన్నెండు దాకా ప్లాటు కోసం ఆలోచన. ప్లాటు దొరగ్గానే-ఆలస్యం అమృతం విషం నానుడి గుర్తుకొచ్చింది-చిత్తుప్రతి ప్రారంభమైంది.

మూడు గంటలదాకా రాజారాం కలం ఎదురు లేకుండా దూసుకుపోయింది. కళ్ళ మంటల్ని, నరాల సమ్మెను లక్ష్య పెట్టకుండా పనిలో పని వెంటనే ఫెయిర్ చెయ్యాలనిపించింది.

పొద్దున్నే పోస్టు డబ్బాలో పడింది బహుమతి కథ. తృప్తిగా నిట్టూర్చాడు రాజారాం. మధ్యాహ్నానికల్లా కాళ్లూ చేతులు పీకడం, తల వెయ్యి పుట్ల బరువు కావడం వగైరా వగైరాలు పునర్నవీకరించబడినై. తోక ముడిచిన జ్వరం తోక విచ్చుకుంది. ఈసారి కమలాకర్‌కు టెలిగ్రాం వెళ్ళడంలో ఆలస్యం జరుగలేదు.

కమలాకర్ ఆఘమేఘాల మీద వాలి బావను నర్సింగ్ హోంలో చేర్పించాడు. భర్తను కంట్రోల్ చెయ్యనందుకు కమల మీద అక్షంతలు రాలినై, మరో పక్షం రోజులు హాస్పిటల్ సావాసం తప్పలేదు.

నర్సింగ్ హోం నుండి ఇంటికొచ్చిన రోజే బహుమతి కొరకు పంపిన కథ తిరిగొచ్చింది-వెల్లి మొహమేసుకుని. ఏనుగులా వెళ్లి పీనుగులా రావడమంటే ఇదే ననిపించింది కమలాకర్‌కు. తిరుగొచ్చిన కవరు విప్పి చూడగానే విషయమర్థమైంది కమలకు. కోపం, అసహ్యం, ఉడుకుమోత్తనం కలబోసుకున్నాయావిడ మొహంలో.

"ఐతే...ఆరోజు జాగారం చేశారన్నమాట... ఇదా ఆ నిర్వాకం? అన్ని రోజులు హాస్పిటల్ పట్టుకు వెళ్ళాడినా మీ బుద్ధి పోనిచ్చుకోలేదు. లాసాఫ్ పే లీవులో ఉన్నా... ఆదాయం, ఆరోగ్యం, రెండూ దెబ్బ తిన్నా...." గుండె లెగసి పడుతుంటే రోషం రెట్టింపైంది. "అసలూ...అసలీసారి కథ రాస్తానంటే ....రాస్తానంటే...." అక్షింతలు వేస్తూ ఆగిపోయింది-ఇంకేమాటలనాల్సొస్తుం దోనని.

"రాస్తే....రాస్తే ఏం జేస్తావ్?" గుర్రుమంది కోలుకుంటున్న పౌరుషం.

"కాళ్ళూ చేతులు విరగ్గొడ్తా... అప్పుడే కమలక్కూడా తలనొప్పి, జ్వరం అందుకున్నాయి తెలుసా! రాయదలుచుకుంటే ఆరోగ్యం కుదుట పడ్డాక సమాజానికేదైనా మేలు జరిగే కథలు రాయండి. పిచ్చి పిచ్చి కథలు రాసి మీరు పిచ్చి అవతారమెత్తకండి. సమాజాన్ని సన్మార్గంలో నడిపించండి చేతనైతే...." కమలాకర్ పళ్ళు పట పటలాడినై. పిడికిళ్ళు బిగుసుకు పోతున్నాయి.

రాజారాం రంగుల కల కుక్కిన పేనైంది. *

(జాగృతి 1..7-జూన్ 1992)